
the timbakktu collective
life, we celebrate you

టింబక్టు కలెక్టివ్

# చిన్నారి నేస్తం

సంచిక : 30 పుటలు : 24 జూలై - ఆగస్టు 2025




చిగురు

ఆకర్షణీయం | ఆహ్లాదకరం | ఆసక్తికరం | అమూల్యం | అపురూపం

టింబక్టు కలెక్టివ్
చైల్డ్ లైన్ నెంబరు
9704039108



## పత్రిక కోసం సహాయ సహకారాలు

సహకారం: చిగురు టీం

ముఖచిత్రం, డిజైనింగ్: అడవి రాముడు

బొమ్మలు : బాలల సంఘాల పిల్లలు,
మిళిత పిల్లలు

సంపాదకీయం :







ముద్రణ: బి.ఎఫ్.ప్రింటర్స్, పెనుకొండ.



ప్రియమైన మిత్రులారా!
అందరికీ శుభాకాంక్షలు.

## సంపాదకీయం

రావమ్మా రావమ్మా
తొలి ఏకాదశి రావమ్మ

వానలతోటి రావమ్మ
వేడుకల వెలుగు తేవమ్మ

గింజలు శుభ్రం చేశాము
గింజలు పూజకు పెట్టాము

పొలం సిద్ధం చేశాము
గింజలు మొలకలు వచ్చాయి

గింజలు పొలాల్లో చల్లాము
జింకలు పొలాలకి వచ్చాయి

రైతులు కావలి వెళ్లారు
పంటలు బాగా పండాయి

కోతకోసి ఇంటికితెచ్చాము
పండగ సంబరం ముగిసేను

కృతజ్ఞతలతో...
మీ సంపాదక బృందం.

ప్రైవేట్ సర్క్యులేషన్ కోసం మాత్రమే

the timbaktu collective

life, we celebrate you

# ఇది నా పుస్తకం


నా పేరు:........................................

తరగతి:........................................

బాలల సంఘం:................................

గ్రామం:........................................

మండలం:....................................





ఎం. హాసిని, సిక్స్ క్లాస్,
చిన్నపరెడ్డిపల్లి, ఆకాశం బాలల సంఘం

## ఇందులో

1. గుణింతాలతో కథ : జీవితం....................05
2. సూక్తులు - పొడుపు కథలు....................06
3. మేము రాసిన కథ: సంతోషం...................07
4. గేయాలు.........................................08
5. బొమ్మకు రంగులు వేద్దాం!.....................09
6. బాలసాహిత్యం................................10
7. జనరల్ నాలెడ్జ్: అంబేద్కర్.................11
8. బాలల హక్కులు: నాటకం...................12
9. నివాసాలు......................................14
10. పాట- వెలుగులు.............................15



11. కథకు బొమ్మ:అతితెలివి........................16
12. ఊహావిహారం మరియు సైన్సు .............17
13. ఇంగ్లీష్ మరియు తెలుగు కథ................18
14. లాజికల్ రీజనింగ్...........................19
15. ఇంగ్లీష్ - వింగ్లీష్.............................20



పి.పూజిత సిక్స్ క్లాస్, జి.చైత్ర ,ఫోర్త్ క్లాస్.

16. నేను గీసిన చిత్రం...........................21
17. నేను గీసిన చిత్రం...........................22
18. సీతాఫలం ( బాటనీ బాబాయి)...........23
19. చిన్న కథ .....................................24



తేజశ్రీ , ఆరో తరగతి, రెడ్డివారిపల్లి

కింది గుణింతాలను కలుపుతూ పదాలను రాద్దాం!.

| | | |
|---|---|---|
| స | గం | ________ |
| | రం | ________ |
| | ంత | ________ |
| | రుకు | ________ |
| | మానం | ________ |

| | | |
|---|---|---|
| ప | సరు | ________ |
| | లవర | ________ |
| | రస | ________ |
| | నస | ________ |

కింది పదాలను గీతలకు తగిన విధంగా రాద్దాం!

ఉదయం ఉడత

ఉపవాసం ఉలవ

తపన తరువు





# జీవితం

ఒక ఊరిలో రాణి అనే బాలిక ఉండేది. ఈ రోజు తినడానికి ఇంటిలో ఏమి వండాలా అని ఆలోచించింది.

తనకు ఎదురుగా టమోటా కనిపించింది. వెంటనే టేబుల్ మీద గల టమోటాలు తీసుకుంది.

టమోటా వెంటనే ఛీ! ఛీ! ఏమి నా జీవితం ఇంత విచారంగా ఉంది. ఎంత పాడైన జీవితం నాది అని టమోటా దిగులు పడింది.

ఇది గమనించిన బంగాళదుంప ఎందుకు అలా దిగులు పడతావు నీవు మంచి కూరలాగా మారి రుచికరమైన భోజనం చేయడానికి ఎంతో ఉపయోగపడతావు అంది.

టమోటా నీకు ఏమి తెలుసు టమోటాను కోసి కోసి కడాయిలో వేసి, నూనె పోసి, వేడి చేసి బాగా వేయించుతారు. నేను ఎంత బాధ అనుభవించాలి తలుచుకుంటే నా గుండె పగిలిపోతుంది అని వాపోయింది.

ఇది గమనించిన నూనె నీవే మేలు టమోటా కేవలం ఒకసారి వేయించబడతావు నేను కూర కోసం,వడల కోసం,పోపు కోసం ఇలా పదే పదే వేయించబడతాను అంది.

వెంటనే పెనము 'చూడు టమోటా నేను కూడా పదే పదే కూరగాయలను, దోసెలను ఇలా రకరకాల వంటల కోసం రోజూ కాలపడతాను. ఎంత వేడి ఉంటుందో, ఒకసారి వేగడానికే ఇలా అంటే ఎలా?'


వీరి మాటలు వినిన మరొక టమోటా ఇలా అంది 'ఓ నా సహోదరీ టమాట మనం మన జీవితాలు ఇతరుల కోసం ఉపయోగపడితే ఇతరులు ఎంతో సంతోషం పొందుతారు. ఒకవేళ ఇలానే ఉండిపోతే పాడైపోయి, బూజుచేరి కఠోరమైన వాసనతోటి అందరూ చీదరించుకుంటారు. అలా కాక కూరలో భాగమైతే రుచిని పొంది ఎంతో పొగుడుతారు. జీవితం మంచిగా ఉండాలంటే ఎవరైనా బాధలు భరించాలి అంతే, ఎవరి జీవితము కేవలం బాధలతోటి కేవలం సంతోషాలతోటి లేదు, సంతోషాలు బాధలు కలగలిపి ఉంటాయి ఆ సంగతి తెలుసుకోవాలి మనం.' ఈ మాటలతో తొలిసారిగా టమోటా ఆలోచనలో పడింది

రచన : బి.నిహారిక బి.ఇందులేఖ, 7వ తరగతి, ఝాన్సీ బాలల సంఘం, ఎం.పి.యు.పి.స్కూల్.

the timbaktu collective
life, we celebrate you

మన మెదడుకు పదును పెడదాం! సొంత ఆలోచనను పెంచుకుందాం!

## పొడుపు కథలు,చిలిపి ప్రశ్నలు ...



1. ప్రాణం లేని చిన్న పాప, అరిచి పిలుస్తుంది ఎత్తు కుంటే చెవిలో గుసగుసలు చెబుతుంది ఏమిటది?

2. నన్ను కొడితే ఊరుకోను, గట్టిగా అరుస్తాను! దేవుడిని పిలుస్తూ మొగుతాను నేను ఎవరు గుర్తించగలవా?

3. తెలిసేలా పూస్తుంది, తెలియకుండా కాస్తుంది! చిన్నదైనా తెలివైనదిగా ఉంటుంది ఏమిటది?

4. తిరిగే దీపమై గాలివానలకే ఆగని దీపం నేను! చమురు లేదు, పిట్టల దీపం ఎవరికి తెలుసు?

5. నడుస్తూ నడుస్తూ ఆగిపోతుంది, పీకపై కత్తి పెడితేనే మళ్లీ నడుస్తుంది, అది ఎవరు?

6. చేతికి అందదు, కంటికి కనబడదు, కానీ ముక్కుకు మాత్రం అందుతుంది, ఆ మాయ ఏమిటి?

7. కూత వేస్తుంది, పరుగు తీస్తుంది, కానీ ఎరుపు చూసిన వెంటనే ఆగిపోతుంది, ఆ అద్భుతం ఏమిటి?

8. ఆకులు లేవు, పూలు లేవు, కానీ ప్రాకే తీగలా ఉంది,ఆ తీగ ఏమిటి?

9. తల్లి మెత్త, నా పిల్లలు మాత్రం కటిక రాళ్లు, ఆ తల్లి ఎవరు?

10. అగ్గి మీద గుక్కిలం, అటు ఇటు తిప్పితే అరక్షణంలో తినవాచ్చును ఎమిటది?

11. కంటికి కనిపిస్తుంది, కానీ గుప్పెట్లో పట్టే అవకాశం లేదు, ఆ దారితప్పినది ఏమిటి?

12. గబుక్కున లేచింది, వన్నెల చిన్నెల వగలాడి ఎండకు, వానకు రక్షణ ఎమిటది?

సేకరణ: కందుకూర్లపల్లి వినాయక బాలల సంఘం
రాచూరు ఝాన్సీ లక్ష్మీబాయి బాలల సంఘం

జవాబు: 1.ఫోన్ 2. గుడిగంట 3. వేరుశనగ కాయ 4. మినుగురు పురుగు 5.పెన్సిల్ 6. వాసన 7. రైలు 8. కరెంట్ తీగ 9. జామకాయ 10. అప్పడం 11. పొగ 12.గొడుగు

## ఇకఇకలు


1. టీచర్: మ్యాథ్స్ బుక్ ఏది?
బంటి: ఆత్మహత్య చేసుకుంది.
టీచర్ :ఎందుకు ?
బంటి: ఆ బుక్ నిండా ప్రాబ్లమ్స్ ఉన్నాయని

2. టీచర్: క్లాసు చెప్పడం పూర్తి అయ్యాక ఏమన్నా డౌట్స్ ఉంటే ఇప్పుడే అడగండి అన్నది.
చింటూ :లేచి టీచర్, ఇంతకీ మీరు ఏ సబ్జెక్టు చెప్పారు ఇప్పుడు!

3. భర్త: కాంతం నిన్ను రెండు నిమిషాల పాటు సీఎం చేస్తే ఏం చేస్తావ్
కాంతం: మ్యాగి చేస్తాను రెండు నిమిషాల్లో
అంతకుమించి ఏం చేస్తాం
భర్త : ఐదు సంవత్సరాల సీఎం చేస్తే ?
కాంతం: అన్ని సంవత్సరాలు చేయలేను, ఎందుకంటే
అంత మ్యాగీ ఎవరు తింటారు?

ఎం.రమ్య, 6వ తరగతి, చామంతి బాలల సంఘం, మరవపల్లి.
సి. పూజ శ్రీ, 5వ తరగతి, కుందేలు బాలల సంఘం, రొప్పాల.

# సంతోషం




ఒక ఊరిలో రామయ్య, లింగమ్మ అనే దంపతులకు రవి అనే కొడుకు ఉండేవాడు. అతను రోజంతా ఎలాంటి పని చేయకుండా టీవీ చూస్తూ, ఊరులో తిరుగుతూ కాలక్షేపం చేసేవాడు.

ఒకరోజు, రామయ్య ప్రేమతో రవికి అతనికి ఇష్టమైన బంగారు రంగు సైకిల్ కొనిచ్చాడు "ఏదైనా పని చేస్తాడేమో!" అని ఆశపడ్డాడు. కానీ ఎలాంటి మార్పూ రాలేదు.

తర్వాత, రామయ్య ఊరి సర్పంచిని కలిసి, "అయ్యా ! నేను ఒక చిన్న అంగడి పెట్టుకోవాలి అనుకుంటున్నాను.
నా కొడుకు ఏ పనీ చేయకుండా సంపాదన లేకుండా ఉన్నాడు. దానికి కొంచెం డబ్బు అప్పుగా ఇవ్వండి" అని అడిగాడు.

సర్పంచు మెల్లగా నవ్వుతూ, "ముందుగా నీ కొడుకు ఏదైనా ఒక చిన్న పని చేసి కొంత డబ్బు సంపాదిస్తే, ఆపై తప్పకుండా అప్పు ఇస్తాను," అన్నాడు.

అంతే! రామయ్య పాత సైకిల్‌ను శుభ్రం చేయించి, "రవి! ఈరోజు నుంచి ఈ సైకిల్ మీద వెళ్లి పాలు, పెరుగు, పేపర్లు ఇంటింటికీ ఇచ్చి రా," అని చెప్పాడు.

ఇష్టం లేకపోయిన రవి మొదటి రోజు కష్టంగా వెళ్లాడు. కానీ మూడు రోజులు పూర్తయ్యేసరికి పని మీద ఆసక్తి పెరిగింది. ఓ వారం తరువాత తన సంపాదన చూసి ఆశ్చర్యపోయాడు!

"నాన్నా! నేను ఇంత సంపాదిస్తున్నానా!" అంటూ ఆనందంతో చెప్పాడు.రామయ్య గర్వంతో సర్పంచ్ దగ్గరకు వెళ్లి రవిలో వచ్చిన మార్పు వివరించాడు.

ఈ విషయం విన్న సర్పంచ్ ఆనందంతో, అంగడి పెట్టుకోడానికి అవసరమైన డబ్బును ఇస్తూ ఇలా అన్నాడు " నీ కుమారుడు ఇప్పుడు తీసుకున్న అప్పు కట్టగలిగే సామర్థ్యం వచ్చినది. ఇలా శక్తి , సామర్థ్యాలు ఉంటె అప్పు తీసుకోవడంలో తప్పులేదు." అన్నాడు.

అప్పటి నుంచి రామయ్య కుటుంబం సంతోషంగా, సమృద్ధిగా జీవిస్తోంది. శ్రమించేవాడు మాత్రమే నిజమైన ఆనందాన్ని పొందుతాడు.

రచన : జి. జయశ్రీ , 6వ తరగతి,
మైత్రి బాలల సంఘం, కురవాండ్లపల్లి

కింది గేయాలను అభినయంతోటి  బాగాపాడుదాం!.

మనకు నచ్చిన లయతోటి ఎక్కువ సార్లు పాడుదాం!

## గాలికాలం

ఎండాకాలం ముగిసింది,
గాలికాలం తొంగి చూసింది

తుమ్ములు వచ్చాయి
జలుబూ జ్వరమూ వచ్చాయి

డాక్టర్ గారు వచ్చారు
వేడివేడి అన్నం తినమన్నారు

గోరువెచ్చనీ  నీళ్లు తాగమన్నారు
బాగా విశ్రాంతి తీసుకో మన్నారు

కె.జయవర్ధన్, కంచి సముద్రం , శివ బాల సంఘం,
జ్ఞాన దీపిక , కంబాలపల్లి



కవిత, పోలేపల్లి వాలంటీర్

## ప్రకృతి చిత్రం



ఉదయం వచ్చెను సూర్యుడు
కాంతులు చిమ్మెను  ముద్దుగా

పొలాలు నిద్ర లేచాయి,
పచ్చ పంటలు నవ్వాయి

ఎర్రగా మెరిసెను  ఆకాశం
తళతళ  నీలి  సముద్రము

పక్షులు పాడెను  పాటలు
ప్రకృతి  గీసెను చిత్రము

అందమైన చిత్రము
ఆనందాన్ని తెచ్చెను

the timbaktu collective
life, we celebrate you



కింది బొమ్మకు నచ్చిన రంగులు వేద్దాం!
బొమ్మ మొత్తం రంగులతోటి నింపుదాం!



# పదవినోదం



| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 గు | | 2 ప | | | 3 ప |
| | | | | | |
| | 4 ప | | | 5 క | |
| 6 కా | | | | | |
| 7 | గు | 8 | | | 9 బెం |
| | | 10 చి | | | |

### ఆధారాలు

**అడ్డం :**

1) తవ్వడానికి ఉపయోగించేది- 4
4) నవ్వులు మరో విధంగా -5
6) పాదం- 2
7) సబ్బు నుంచి వచ్చేది గజిబిజి అయింది-3
10) ఒక దుంప -4

**నిలువు:**

1) దేవాలయం-2
2) అక్షరాభ్యాసం చేయాలంటే ఇది తప్పనిసరి- 3
3) రాత్రికి వ్యతిరేకం-3
4) పార -జంట పదం-3
5) పంతం -2
6) వేడుకలలో ఇచ్చేది-3
8) నాలుక తెలియచేసేది-2
9) ఒక కూరగాయ-2

ఆలివేలమ్మ

# చెప్పుకోండి చూద్దాం?

1.నేను మూడు అక్షరాల పదాన్ని,
- “ఆగు” లో ఉంటాను.
- “జాగు “లో ఉండను.
- “శరణం” లో ఉంటాను.
- చరణంలో ఉండను.
- “మాయం “లో ఉంటాను
- “మాయ”లో ఉండను.

నేనెవరో చెప్పుకోండి చూద్దాం?





ఆలివేలమ్మ

2. నేను ఐదు అక్షరాల అందమైన పదాన్ని కనిపెట్టండి
- ఒక అక్షరం పోతే అందులోకి ఇష్టమైన ఆహారపంట ?
- రెండు అక్షరాలు కూడా పోతే హిమాలయాల్లో అప్పుడు ఇప్పుడు ఎల్లప్పుడూ ఉండేది?
- బజార్లో కొనేటప్పుడు అడిగేది ఏంటి? పైన ఉన్న వ్యాఖ్యలలో దాగి ఉన్న సూచనల ఆధారంగా ఐదు అక్షరాల అందమైన ఆంగ్ల పదాన్ని కనిపెట్టండి.

ధామొదర్

# మ్యావ్ మ్యావ్



మ్యావ్ మ్యావ్ పిల్లి మా ఇంటి పిల్లి
ముద్దుగా నవ్వే మీసాల పిల్లి

పాలు, పెరుగు దొంగలించే పిల్లి
నాతో దూకుతూ ఆడేటి పిల్లి

మహా చిలిపి పిల్లి మాఇంటి పిల్లి
అందమైన పిల్లి అల్లరి పిల్లి
దొంగనా పిల్లి నాకు నచ్చే పిల్లి

రచన : ఏ .లైలా,9 వ తరగతి,
మదర్ తెరిసా బాలల సంఘం

# రంగుల చిలుక



రంగు రంగుల చిలుక
రమ్యమైన చిలుక సీతాకోక చిలుక

మా పెరటికి వచ్చింది పూలపై వాలింది
తేనెలే తాగింది తన వెంట తిప్పింది

ముచ్చటలే చెప్పింది కనువిందు చేసింది
పట్టుకుందామంటే తుర్రు మని ఎగిరింది

రచన: అలివేలమ్మ, చిగురు కార్యకర్త

## "బుజ్జి మెదడు బాగుంటే పరీక్షలూ ఆటలే!"

1. మొఘల్ సామ్రాజ్య స్థాపకుడు ఎవరు?
2. ఎర్రకోటను ఎవరు నిర్మించారు?
3. "ప్రకృతి దినోత్సవం" ప్రపంచవ్యాప్తంగా ఎప్పుడు జరుపుకుంటారు?
4. రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని తయారు చేయడానికి ఎన్ని రోజులు పట్టింది?
5. గంగా నది ఎక్కడ పుట్టింది?
6. బంగ్లాదేశ్‌లో గంగా నదిని ఏమని పిలుస్తారు?
7. అన్నమయ్య తల్లిదండ్రుల పేర్లు ఏమిటి?
8. మన శరీరంలో రక్తాన్ని పంపే అవయవం ఏది?
9. చంద్రుడు భూమికి ఎంత దూరంలో ఉన్నాడు?
10. మన శరీరంలో ఎక్కువగా ఉండే మూలకము (ఎలిమెంట్) ఏది?
11. విద్యుత్‌ను కనిపెట్టిన శాస్త్రవేత్త ఎవరు?
12. భారతదేశంలో అతి పెద్ద జాతీయ బ్యాంక్ ఏది?
13. భారతదేశంలో అతిపెద్ద నగరం ఏది?
14. భారతదేశంలో అతి పెద్ద పీఠభూమి ఏది?
15. భారతదేశంలో అతి పెద్ద డ్యాం ఏది?

హెచ్. కృపారాణి, 8వ తరగతి
శాంతి బాలల సంఘం, ఆర్. లోచర్ల

సమాధానాలు: బాబర్ ,షాజహాన్ , ఏప్రిల్ 22
2 సంవత్సరాలు 11 నెలలు 18 రోజులు ,గంగోత్రి,
పద్మ , లక్కమాంబ, నారాయణ సూరి, గుండె,
సుమారు 3,84,400 కిలోమీటర్లు ,ఆక్సిజన్,
బెంజమిన్ ఫ్రాంక్లిన్ ,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
కలకత్తా ,దక్కన్ పీఠభూమి, భాక్రానంగల్ డ్యాం

తెలుసుకుందాం ..

# మంచి మిత్రుడు



ఒకప్పుడు మౌలీ అనే చిన్న గ్రామం ఉండేది. ఆ ఊరిలో పిల్లలు కొంతమంది కలసి ఆడుకునేవారు. కొంతమంది పిల్లల్ని ఆటల్లోకి పిలవరు, వారిని కలుపుకోరు. ఇలా కలుపుకోని వాళ్లు పేదవాళ్లు", "వాళ్ల అమ్మానాన్న కూలీలు అని, తక్కువ వారని, వారిని తాకరాదని " అని అంటూ వారిని పక్కన పెట్టారు.

పక్కన పెట్టిబడిన ఓ చిన్న పిల్లవాడికి చాలా బాధగా అనిపించింది. అతని పేరు భీము. భీము చదువులో చాలా చురుకైనవాడు. రోజూ పాఠశాలకు వెళ్లి, పుస్తకాలు చదివి కొత్త విషయాలు నేర్చుకోవడం అతనికి చాలా ఇష్టం.

ఒకరోజు భీము "గురువుగారు! మనమంతా మనుషులే కదా? మరి కొందర్ని తక్కువగా ఎందుకు చూస్తున్నారు?"అని అడిగాడు.

ఆ మాటలు విని గురువు ఆశ్చర్యపోయారు. తర్వాత గురువు "అవునురా భీమూ! మనమందరం సమానమే. కానీ అందరికీ ఇది గుర్తు చేయాలి. దానికి ధైర్యం అవసరం!" అని చెప్పారు.

ఆ మాటలు భీముని గుండెల్లో నిలిచిపోయాయి. ఆ రోజు భీము ఒక నిర్ణయం తీసుకున్నాడు.

"నేను పెద్దవాడినయ్యాక, ప్రతి ఒక్కరికి సమానం ఎవ్వరూ తక్కువ కాదని ప్రపంచానికి చెప్పాలి!"

అలా చిన్ని భీము చాలా కష్టపడి చదివి, దేశం మొత్తం తిరిగి, విదేశాల్లో కూడా గొప్ప విద్యను అభ్యసం చేసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అయ్యాడు.
ఎంత చదివినా, ఎన్ని హోదాలు వచ్చినా , తన గ్రామాన్ని, తన ప్రజలను మాత్రం ఎప్పుడూ మర్చిపోలేదు.
"మనమంతా ఒకటే! అందరికీ సమాన హక్కులు ఉండాలి. ఎవ్వరినీ తక్కువ చూడకూడదు!" అంబేద్కర్ ఎప్పుడూ చెబుతారు .

అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాశారు. అందులో ప్రతి ఒక్కరికీ హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం ఉండేలా చేశారు. అందుకే ఆయన్ని "రాజ్యాంగ పితామహుడు" అంటారు.

ప్రతి ఒక్కరిని సమానంగా చూడాలి, చదువుకోని ప్రతి ఒక్కరిని చదవమని ప్రోత్సహించాలి. ప్రేమగా, స్నేహంగా కలిసి ఉండాలి.

మన దేశాన్ని అందరం కలసి బాగు చేయాలి. ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటే, మన దేశం సంతోషంగా ముందుకు సాగుతుంది!

# బాలల హక్కులు

# మల్లె మొగ్గ

## --నృత్య రూపకం--

పాత్రలు: మల్లి, నలుగురు స్నేహితులు, అమ్మ, ఇద్దరు అన్నలు, మామ, అత్త, భర్త, పూజారి
సహాయకులు: ఇల్లుకు ఇద్దరు బళ్లకు ఇద్దరు

పాట:
పిల్లలండి... పిల్లలు....
పల్లె గుండె మల్లెలు
ముద్దబంతి దండలు
పిల్లలండి... పిల్లలు ....
వేకువ పిట్టల కూతలు
మాపన కొంగుల భారెలు
చెరువుకు గట్టున చెట్లు నీడన -2-
వీధి వాకిట ఇంటి ముంగిట
--" పిల్లలండి"--

గాలి నోట ఈలలు ఏటి పాట జాలలు
బర్రెల వీపున గొర్రెల దాపున
ఆవుల మోపన మేకల మందన
-- "పిల్ల లండీ "--
కాలా గజ్జా కంకాలమ్మ
వేగు చుక్క వెలగ మొగ్గ
మొగ్గ కాదురా మారేడు చెట్టు
కాలు తీసి కడగా పెట్టు హేయ్ ... హేయ్ ...

ఎగురుతూ పోయే పిల్లల నడుమ
గంతులు వేసే లేగల నడుమ
ఆడి పాడే పిల్లలతోటి
ఊగేవాగే పిట్టల తోటి
ఉన్నది చిన్నది చక్కని చుక్క
ఏపుగా ఎదిగే పచ్చని మొక్క
చిట్టి పొట్టి పిల్లండి
దాని పేరు మల్లి అండి
గుడు గుడు గుంచం గుండె రాగం
సన్న బియ్యం చాయా పప్పు
గూట్లో రూపాయ్ నీ మొగుడు సిపాయ్
హేయ్... హేయ్ ...




కాటుక కళ్ళు తెల్లని ఒళ్ళు
ముక్కున పుడక చక్కని నడక
ఉన్నది చిన్నది చక్కని చుక్క
ఏపుగ పెరిగే పచ్చని మొక్క
చిట్టి పొట్టి పిల్లండి
దాని పేరు మల్లి అండి
దాగుడుమూత దండాకోర్.....
పిల్లీ వచ్చే ఎలకా భద్రం
ఎక్కడి దొంగలు అక్కడే
సాంబార్ బుడ్డి..
(మల్లి కళ్ళకు గంతులు కట్టుకుని
అటు ఇటు తిరుగుతూ ఉంటుంది)

మామ: ఆగు పిల్లా ఆగు ఏ ఊరు
ఏ వాడ పిల్లా నీది
మల్లి:ఈ ఊరు ఈ వాడ అయ్యా నాది
మామ : ఏం పేరు ఏం పేరు పిల్లా నీది
మల్లి : నా పేరు నా పేరు మల్లి అండి
మామ: పిల్ల బాగుంది! పిల్ల బాగుంది!
పిల్ల బాగుంది
(మామ, అత్త ,భర్త ఎంట్రీ)

పాట: పెళ్లి వారమండి ...
మగ పెళ్లి వారమండి
పిల్లను చూడగా వచ్చామండి
ఏరికోరి అడిగామండి
--"పెళ్లి వారమండి "--

(అమ్మ ఇద్దరు అన్నలు ఎంట్రీ)

పాట. పెళ్ళివారమండి
ఆడ పెళ్లి వారమండి
పిల్లను చూడగా వచ్చారండి
ఏరి కోరి అడిగారండి
-- "పెళ్లి వారమండి "--



కె. మైథిలి , టింబక్టు ,
ఆరో తరగతి

మామ: మరి ఆలస్యం ఎందుకు?
కానీయండి పెళ్లి కానీయండి

అమ్మ: ఎదిగి ఎదగని పిల్లని
విరిసి విరియని మొగ్గండి
13 ఏళ్ల వయసండి
కొంచెం కాలమాగండి
కొంచెం వేసి చూడండి ....

మామ అత్త అందరూ:
కుదరదు కుదరదు కుదరదు
సచ్చే ముసలిది చూడాలి పెళ్లి
కానీయండి పెళ్లి కానీయండి

మామ: కట్టండి తోరణాలు...
పిలవండి పేరంటాలు
వాయించండీ భజంత్రీలు
మోగించండి సన్నాయిలు
పి పి పి పి పి పి..... పి పి పి పి
(పెళ్లి అయిపోయింది అప్పగింతలు)





అమ్మ: పోవాలి తల్లి మెట్టినింటికి ...
పేరు తేవాలి నీవుపుట్టినింటికి ...
అత్తమామల సేవ చేయాలి ...
నీవు భర్త మనసు తేలుకోవాలి...
అనుకువతో మసులు మా తల్లి...
మాతల్లి.... బంగారు మల్లి....

అల్లుడా మా ఇంటి అల్లుడా...
ముద్దు ముద్దుగా  సాకినాము మల్లిని ...
నీ చేతపెడుతున్నాము బంగారు తల్లిని ...

వదిన గారు. .వదిన గారు.. ఓ వదిన గారు....
 వరించి చేసుకున్నారు మల్లిని...
 మీరు ఆదరించి... ప్రేమించండి తల్లిని..
--" పోవాలి తల్లి"--

(వాకిలి సెట్ అప్ చేసుకోవాలి)

మల్లి ఎంట్రీ: అరిందలాగా అత్తారింటికి చేరింది ..
కొత్త తీరక బెదిరి బెదిరి పోయింది..
సంధ్య పొద్దుల్లో మొగుడు వచ్చి సరసలాడితే ...
పక్క పక్కకే తప్పుకుంది ..
పొద్దుగూకితే గజగజ వణికేది...
చేయి తగిలితే బోరు బోరున ఏడ్చేది ...
లాల లాలలా.... లా లాల.... లా లాల....
చింత తోపుల్లోనా ఉయ్యాల ఊగేటి "2"
అల్లనేరేడల్లే రాళ్లతోనే కొడితే
పరువే పోయిందని మామ పల్లె కొరికాడు
బుజ్జి కోడి పిల్లతో ముద్దుగా నేను ఆడితే "2"
ఊళ్లో పిల్లలతోటి గోలీల నేను ఆడితే "2 "
అంట్లు తోమ లేదని అత్త నెత్తిన కొట్టింద
లాలా లా లా లా లా ల
(అన్నలు ఇద్దరు చెల్లి)

వచనం: ఒకనాడు తన ఇంటికి వచ్చిన అన్నలను
చూసి పురి విప్పిన నెమలి తానైంది మల్లి
 మల్లి: అరుగు మీద కూర్చున్న ఓ మామగారు ..
ఓ మామగారు ..మా అన్నలు వచ్చారు.
నన్నంపుతారా? నన్నంపు తారా?

మామ: నేనెరగ నేనెరగా మీ అత్తను అడుగు..

మల్లి:
పెరటి లో ఉన్నట్టి ఓ అత్త గారు .. ఓ అత్తగారు..
మా అన్నలు వచ్చారు నన్నంపుతారా? నన్నంపుతారా?
అత్త:
నేనెరగ నేనెరగా నీ భర్తని అడుగు..
మల్లి:
పట్ట మంచం మీద పవళించినట్టి
ఓ భర్త గారు ఓ భర్త గారు
మా అన్నలు వచ్చారు నన్నంపుతారా? నన్నంపుతారా?



భర్త :
నేనెరగ నేనెరగా మా అమ్మని అడుగు
అత్త :
అచ్చట్లు ముచ్చట్లు తీరనె లేదు మా ఇంటిదానిగా
మారనేలేదు వట్టి మనిషి నీవు అసలే కాదు
పయనం కట్టేటి రోజులు కావు ..రోజులు కావు
మల్లి:
ప్రేమతో వచ్చిన ఓ అన్నలారా మా అన్నలారా
అత్తవారింటికి  చేరిన పిల్లకు ఓ అన్నలారా
అడిగే హక్కు చల్లనే చెల్లావు మా అన్నలారా
అమ్మ నాన్నలకు దండాలు చెప్పండి మా అన్నలారా ...
నా దోస్తులు అందరికీ ముచ్చట్లు చెప్పండి మా అన్నలారా..
అన్నలు ఇద్దరు:
పోయి వస్తామమ్మా చెల్లెమ్మ మళ్లీ వస్తామమ్మా
మాయమ్మ నీకు దిక్కెనట్టి పెనిమిటి జాగ్రత్త
కడుపులో మెసిలేటి నీ బిడ్డ జాగ్రత్త
--పోయి వస్తానమ్మా --

పాట:
వాంతుల తోటి వడలిపోయింది..
జరిగేది తెలియక కదిలిపోయింది ...
తల్లి ని తలుసుకొని కృంగిపోయింది...
కడుపుని చూసుకొని భీతిల్లి పోయింది...
పనీపాటలతోటి నీరసించింది....
నెత్తురు చాలక క్షీణించిపోయింది ..
లోనబిడ్డఎదగలేకపోయింది....
లేత ఒళ్ళు మోయలేకపోయింది...
ఏడు నెలల కడుపు ఎగదన్ను కొచ్చింది ...
పెరగని ఒళ్లంతా  గిడస బారింది ...
కానీ కాలంలో కానుక వచ్చింది...
 నొప్పులు పడలేక ...ఊపిరిపోయింది ...
చిన్నారి మల్లి ...నేల రాలింది...
బంగారు తల్లి ...నేల కూలింది...

స్నేహితులు: చిన్నారి మల్లి... బంగారు తల్లి
చెంగావి మల్లి... కర్పూరవల్లి కడితేరి పోయింది...
కడతేరి పోయింది...

స్నేహితులు:
అమ్మలారా ..అయ్యలారా.
అక్కలారా ... తమ్ముల్లారా..
చేతిలో మమ్ము పెంచిన ...
మనసు పొత్తిళ్లలో మమ్ము దాచిన ..
మా మొర ఆలకించండి ...
మా బాధలు తీర్చండి ....
ఏ చిన్న బిడ్డకు పెళ్ళిచేసిన..
ఏ చిట్టి తల్లికి పారాణి పెట్టిన...
మళ్లీ జ్ఞాపకం పాకి రావాలా ..
మీ గుండెలని తాకి పోవాలా..
ఈ కథ అంచులంచులుగా ఎదిగి ..
ఈ వేదన కొనలు చాటి
చిన్నారులంతా హాయిగా ఉండాలా
చిరుతలంతా నేతల అవ్వాలి "2"
--చిరుతలంతా --







# నివాసాలు కోల్పోవడం

## --ఇంటి అవసరం ఎవరికి?--

పిల్లలూ, మీకు తెలుసా? ప్రతి మనిషికి ఓ సొంత ఇల్లు ఉండాలని ఒక కోరిక ఉంటుంది. దానికోసం వారు ఎంతో శ్రమించి పనిచేస్తారు. ఎందుకంటే ఇల్లు వాతావరణం నుంచి మనల్ని రక్షిస్తుంది, మన వస్తువులు, ఆహారాన్ని కాపాడుతుంది.

మనకు ఇల్లు అవసరమైనట్లే, పక్షులు, జంతువులు, కీటకాలు, పాములు, మొసళ్ళు,... లాంటి అందరికీ కూడా ఓ ఇల్లు అవసరం. ఇది వాళ్ల "నివాసం".

ప్రతి జీవి జీవించాలంటే నివాసం తప్పనిసరి. మన చుట్టూ చాలా రకాల జీవావరణాలు ఉన్నాయి. అందులో అనేక జీవులు నివసిస్తున్నాయి. పక్షులు, జంతువులు, కీటకాలు, సరిసృపాలు, ఉభయచరాలు. ఇవి అన్ని కూడా తమకు తగిన చోట నివసిస్తాయి. కానీ ఆ నివాసాలు లేకపోతే వాటి మనుగడకే ముప్పు వాటిల్లుతుంది.

### ఎందుకు నివాసాలు పోతున్నాయి?

ఈ మధ్యకాలంలో చాలా జీవులు తమ నివాసాలను కోల్పోతున్నాయి. ఇది చాలా పెద్ద సమస్య.

### ప్రధాన కారణాలు:

1. జనాభా పెరుగుతుండటం: మనుషులు ఎక్కువవుతున్న కొద్దీ, ఇళ్ళు అవసరమవుతున్నాయి. అందుకోసం అడవులను తొలగించి కొత్త ఇళ్ళు కడుతున్నారు. దీంతో జంతువుల ఇళ్లు పోతున్నాయి.

2.వ్యవసాయ విస్తరణ : పంటలు పండించడానికి, పశువులను పెంచడానికి అడవులు నరుకుతున్నారు. ఇది కూడా నివాస నష్టం.

3. పారిశ్రామిక అభివృద్ధి: కార్ఖానాలు, ప్లాంట్లు పెరుగుతున్నాయి. వీటిని నిర్మించడానికి వనరులు కావాలి. అందుకే అడవులను కట్ చేస్తూ, జీవుల నివాసాలను తొలగిస్తున్నారు.

4.రవాణా మార్గాలు: నూతన రోడ్లు, రైలు మార్గాలు వేసే సమయంలో అడవులు నశించాయి. వీటి వలన జీవుల ప్రాంతాలు విడిపోయాయి.

5. విద్యుత్ ఉత్పత్తి: కరెంటు తయారీకి గాలి మరలు, సోలార్ ప్లాంట్లు వేశాం. ఇవి వేసేందుకు అడవులను తవ్వేస్తున్నారు.

6.మైనింగ్ : బంగారం, ఇనుము, ఇతర ఖనిజాల కోసం భూమిని తవ్వే మైనింగ్ జరుగుతోంది. ఫలితంగా పెద్ద ప్రదేశాల్లో అడవులు నాశనం అవుతున్నాయి.

7.నివాసాల విభజన: ఒకే పెద్ద అడవి చిన్న చిన్న ముక్కలుగా విభజించబడుతోంది. రోడ్లు, నగరాలు, పొలాలు ఈ విభజనకు కారణం. దీంతో జంతువులు తమ మధ్య ప్రయాణించలేక ఇబ్బంది పడుతున్నాయి.

### ఇవి జరిగిన తర్వాత ఏమవుతోంది?

జంతువులు ఆహారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాలి. పిల్లలు పెట్టుకోవడానికి భద్రత ఉండదు. వివిధ జాతుల మధ్య జన్యు వైవిధ్యం తగ్గిపోతుంది. కొన్ని ప్రాంతాల్లో నివాసం ఉన్నా, నాణ్యత తక్కువగా మారుతోంది. నీరు, గాలి, నేల కాలుష్యం పెరుగుతోంది.

వాతావరణ మార్పులు: జంతువులు కొన్ని ఉష్ణోగ్రతలకు అలవాటుపడతాయి. కానీ వాతావరణం మారిపోతే, అవి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఆ ప్రయాణంలో చాలా ప్రాణాలు పోతున్నాయి.

### సహజ కారణాలు:

మనం చేస్తూ ఉండే పనులతో పాటు, కొన్ని సహజ కారణాలు కూడా నివాసాల నష్టానికి కారణమవుతాయి. అగ్ని పర్వతాలు, భూకంపాలు, వరదలు వంటివి. అయితే ఇవి మానవ చర్యలతో పోలిస్తే తక్కువగా ఉంటాయి.



### మనం ఏమి చేయాలి?

చెట్లు నాటాలి, అడవులను రక్షించాలి ప్లాస్టిక్ వాడకూడదు, జీవుల పట్ల ప్రేమగా ఉండాలి.
నివాసాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి. ప్రతి జీవికీ ఒక ఇల్లు అవసరం.

మనం తినడానికి, పాఠాలు చదవడానికి, నిద్రపోవడానికి ఇల్లు ఎంత ముఖ్యమో ప్రతి పక్షికీ, జంతువుకీ, కీటకానికీ! ప్రపంచంలో అన్ని జీవులకు ఓ శుభ్రమైన నివాసంగా అవసరం.





ఎన్. ముఖేష్ ,
కల్పవల్లి టీం .

బాగాపాడుకుందాం! ఎక్కువ సార్లు నోటికి వచ్చే వరుకు పాడుకుందాం!

# వెలుగులు



పలక బలపం పట్టేద్దాం
హాయిగా బడికి వెళ్లొద్దాం
చేయి చేయి కలిపేద్దాం
చక్కగ చదువులు చదివేద్దాం

ఆటలు హాయిగ ఆడేద్దాం
పాటలు తియ్యగ పాడేద్దాం
బొమ్మలు బాగా గీసేద్దాం
ఇంటికి నవ్వులు అద్దేద్దాం

చెట్టు చేమను పెంచేద్దాం
పిట్టల గూళ్లను రక్షిద్దాం
వాన నీళ్లను రప్పిద్దాం
భూమిని పచ్చగ మార్చేద్దాం

గొప్పగ చదువులు చదివేద్దాం
సంపద ఎంతో సృష్టిద్దాం
ఆకలి బాధలు తీర్చేద్దాం
జగతిని శాంతితో నింపేద్దాం

కుల మతాలను నిరసిద్దాం
అందరు ఒకటని చూపిద్దాం
యుద్ధం వద్దని చెప్పేద్దాం
నిండుగ వెలుగులు నింపేద్దాం

రచన : శ్రీదేవి, జయచంద్ర ,
రాధ స్కూల్ ఆఫ్ లెర్నింగ్, అనంతపురం.

కింది కథ చదివి, కథకు అనుగునంగా
మీకు నచ్చిన విధంగా బొమ్మ గీద్దాం!

కథకు బొమ్మలు గీయండి.

మీకు నచ్చిన విధంగా కథకు అనుగుణంగా బొమ్మను గీయండి.

# అతి తెలివి

అనగనగా ఓ ఊరిలో రంగమ్మ, రంగయ్య అనే ముసలి దంపతులు ఉండేవారు. వాళ్లకి పిల్లలు లేరు, కానీ చాలా పిసినారులు. సరిగా తినేవారు కాదు. చిన్న ఖర్చుకూడా చేయకుండా బ్రతికేవారు.

ఒక రోజు ఊరిలో తిరునాళ్లు మొదలయ్యాయి. వెంటనే రంగమ్మ రంగయ్యకి భయం పట్టుకుంది. "అయ్యో! బంధువులు వచ్చేస్తారేమో వడ్డింపులు, ఖర్చులు! ఏం చేద్దాం?" రంగయ్య "ఏమైనా ఉపాయం తోచుతుందా?" అని అడిగాడు.

అప్పుడు రంగమ్మ కళ్ళు మెరిపిస్తూ చెప్పింది. "వాళ్లు ఇంటికొస్తే మనిద్దరం దుప్పట్లో కప్పుకుని ఆరోగ్యం చాలా బాగాలేదు అన్నట్టు పడుకుని నటించేసేద్దాం!" అది మంచి ఐడియా అని రంగయ్య ఒప్పుకున్నాడు.

తిరునాళ్ల మొదటి రోజే దూరంగా ఇద్దరు బంధువులు కనిపించారు. రంగయ్య పరుగెత్తి వచ్చి రంగమ్మకి చెప్పాడు "వాళ్లు మన ఇంటికే వస్తున్నారు!"

ఇద్దరూ మంచాల మీద పడుకొని, మొహాలపై విచారము ఉండేలా పెట్టారు. వాళ్లు ములుగుతూ నటించారు .
"ఓహెూఓ! ఓమ్మా ఓయ్యో!"
బంధువులు వచ్చి చూసి చాలా దుఖించారు .
"ఇంత కష్టమా? ఏం జరిగిందో ఎవరికైనా చెప్పాలి!"
అంటూ వెళ్లిపోయారు.

ఇక రంగమ్మ రంగయ్య నవ్వుకుంటూ లేచి, "మన ప్లాన్ అదిరింది! ఒక్కరినీ నిలుపుకోలేదు!" అంటూ ఆనందించారు.


కానీ... మరుసటి రోజు ఆశ్చర్యం! బంధువులు, మిత్రులు కలిపి ఒక 50 మంది వచ్చేసారు! "వాళ్లు చాలా కష్టంలో ఉన్నారట!" అని అందరూ అనుకొని వాళ్ళ ఇంటికి చేరినారు. తిరునాళ్ల మొత్తం పది రోజులు వాళ్లతోనే ఉండిపోయారు! రంగమ్మ రంగయ్యకి అది పెద్ద భారమై, చివరికి ఇలా అనుకున్నారు...

"తెలివిగా ఉండాలి, కానీ
అతి తెలివి చూపిస్తే...
చిక్కుల్లో పడిపోతాము!"

కింది బొమ్మ ఆధారంగా పదాలు, వాక్యాలు, కథ, గేయం....
మనకు నచ్చిన విధంగా రాద్దాము!

ఊహా విహారం

# ప్రయోగం




## జడత్వం (Inertia)

ఉద్దేశ్యం: ఈ ప్రయోగం ద్వారా జడత్వం అనే భావనను అర్థం చేసుకుందాం. అంటే ఒక వస్తువు నిశ్చలంగా ఉంటే, అది కదలడానికి బలమే అవసరం.

కావలసినవి: ఒక గాజు గ్లాస్, ఒక పేకాట ముక్క లేదా గట్టి అట్ట ముక్క , ఒక నాణెం (₹1, ₹2 వంటి తక్కువ బరువు నాణెం సరిపోతుంది)

ప్రయోగ విధానం: టేబుల్‌పై గ్లాస్‌ను నిలబెట్టి ఉంచండి. గ్లాస్ మీద అట్ట ముక్కను వేసుకోండి. ఆ అట్టముక్క మధ్యలో నాణెం ఉంచండి. ఇప్పుడు ఆ పేకాట ముక్కను వేగంగా అడ్డంగా ఒక్కసారి లాగండి (నెట్టండి) . (గ్లాస్‌కు తాకకుండా)

ఏమి జరుగుతుంది? (పరిశీలన) : అట్ట ముక్క ఒకవైపు జారిపోతుంది. నాణెం మాత్రం కదలకుండా గ్లాస్ లోపల పడిపోతుంది!

ఫలితం (ఎందుకు అలా జరిగింది?):
నాణెం మీద మీరు నేరుగా బలం ప్రయోగించలేదు కనుక అది అదే స్థానంలో ఉంటుంది. ఇది జడత్వం అనే లక్షణం.
Newton గారి మొట్టమొదటి గతి నియమం కూడా ఇదే చెబుతుంది:
"ఒక వస్తువు కదలకుండా ఉంటే కదలకుండానే ఉంటుంది, లేదా కదులుతూ ఉంటే స్థిర వేగంతో సరళరేఖలో కదులుతూ ఉంటుంది, దానిపై ఏవైనా బలాలు పని చేయనంతవరకు."

జాగ్రత్తలు: గ్లాస్‌ను సజావుగా ఉన్న టేబుల్‌పై ఉంచాలి. అట్ట ముక్కను వేగంగా గ్లాస్‌ను తాకకుండా లాగాలి (నెట్టాలి). నాణెం తక్కువ బరువు ఉన్నదే తీసుకోవాలి, అప్పుడు ఫలితం బాగా కనిపిస్తుంది.

ఆలోచించండి – ప్రయత్నించండి!
ఇది మీ ఇంట్లో ఉండే వస్తువులతో చేయగలిగే చిన్న ప్రయోగం.
ప్రయోగం చేసిన తర్వాత మీరు గమనించిన విషయాలు క్రింద రాయండి:
నాణెం కదలకుండా ఎందుకు ఉంటుంది అనిపించింది?
మీరు వేరే బరువుతో చేసినప్పుడు ఏం జరిగింది?

బొమ్మల ఆధారంగా ఊహించి కథ రాయండి.



................................................
................................................
................................................
................................................
................................................
................................................
................................................
................................................
................................................
................................................
................................................
................................................



## ప్రశ్నకి స్నేహితులు దొరికారు
## Question finds friends

Once there was a Question who didn't know how to find the answer.
ఒకసారి ఒక ప్రశ్న ఉండేది. ఆ ప్రశ్నకి జవాబు ఎలా కనుగొనాలో తెలియదు.

Question was confused and desperate.
అది గందరగోళంగా, ఆవేదనగా ఉండేది.

He wanted to know about everything.
ఆ ప్రశ్నకి అన్ని విషయాల గురించి తెలుసుకోవాలనిపించేది.

One day Question was looking for answers about how does a bird fly.
ఒక రోజు ప్రశ్న, పక్షి ఎలా ఎగురుతుందో తెలుసుకోవాలని ఆశపడింది.

He asked the birds, he wanted to know how flowers bloom, so he asked the flowers.
అందుకే అది పక్షులను అడిగింది. తర్వాత, పూలు ఎలా వికసిస్తాయో తెలుసుకోవాలని పూలను అడిగింది.

No one could explain how things happen. Then he asked his friend Alaka.
కానీ ఎవ్వరూ సరైన సమాధానం చెప్పలేకపోయారు. అప్పుడు ప్రశ్న, తన స్నేహితురాలు అలకాని అడిగింది.

Alaka took Question to the library and showed him the books that have answers.
అలకా, ప్రశ్నని లైబ్రరీకి తీసుకెళ్లింది. ఆమె అక్కడున్న పుస్తకాలను చూపించింది, అవన్నీ సమాధానాలతో నిండిపోయి ఉండేవి!

Question was thrilled to find new answers and more questions.
ప్రశ్న చాలా ఆనందపడింది! ఇప్పుడు ప్రశ్నకి కొత్త కొత్త సమాధానాలు దొరుకుతున్నాయి, ఇంకా కొత్త ప్రశ్నలూ కూడా వచ్చాయి.

He read a lot of books and learnt about new things.
అది రోజూ పుస్తకాలు చదువుతూ కొత్త విషయాలు నేర్చుకుంటోంది.


-Forest pen



మయన్
Mayan
Bengaluru







# లాజికల్ రీజనింగ్

1) వీటిలో ఒకటి పండులోకాదు! దాన్ని గుర్తించండి. (    )

అ) క్యారెట్     బి) మామిడి

సి) బొప్పాయి     డి) జామ

2) ఒక వ్యక్తి మొదట 10 మీటర్లు ఉత్తర దిశగా నడిచాడు. తర్వాత కుడివైపు తిరిగి మరో 10 మీటర్లు నడిచాడు.

ఇప్పుడు అతను ఎటు చూస్తున్నాడు? (    )

ఏ) ఉత్తరం     బి) పడమర

సి) తూర్పు     డి) దక్షిణం

3) 3, 6, 12, 24, ____, 96 ⟶ ఖాళీలో ఏ సంఖ్య వస్తుంది? (    )

ఏ) 42   బి) 44   సి) 46   డి) 48

4) "DOG" అనే పదాన్ని "EPH" గా కోడ్ చేశారు. అయితే " CAT " ఎలా కోడ్ అవుతుంది? (    )

అ) FBA   బి) DBU   సి) AB   డి) ANT

5) 11, 13, 17, 19, 23, ____, 31 ⟶ ఖాళీలో ఏ సంఖ్య వస్తుంది? (    )

ఏ) 25   బి) 26   సి) 28   డి) 29

6) రాము వయస్సు ఇప్పటికి 30. ఐదేళ్ళ తర్వాత ఆయన వయస్సెంత అవుతుంది? (    )

ఏ) 35   బి) 36   సి) 37   డి) 38

7) 9, 18, 27, ____, 45, 54 → ఖాళీలో ఏ సంఖ్య వస్తుంది? (    )

ఏ) 38   బి) 35   సి) 36   డి) 48

8) వీటిలో ఒకటి కంప్యూటర్‌కు సంబంధించినది కాదు! గుర్తించండి. (    )

అ) కంప్యూటర్     బి) మౌస్

సి) పెన్సిల్     డి) కీబోర్డు

9) రవి పొందిన మార్కులు: 15, 12, 9, 17, 11, 8. అయితే సగటు మార్కులు ఎంత? (    )

అ) 10   బి) 15   సి) 12   డి) 8

10) ఒక డజను అరటిపండ్ల ధర ₹72. రవికి రెండు అరటిపండ్లు కావాలి. ఆయన ఎంత చెల్లించాలి? (    )

అ) ₹11   బి) ₹12   సి) ₹15   డి) ₹20

11) ఒక లీటరు జ్యూస్ ధర ₹50. 2.5 లీటర్ల ధర ఎంత అవుతుంది? (    )

అ) ₹150   బి) ₹130   సి) ₹125   డి) ₹175

12) 5 : 25 :: 6 : ? → సరైన సంఖ్యను గుర్తించండి.

(    ) అ) 35   బి) 36   సి) 40   డి) 45





# ఇంగ్లీష్ - వింగ్లీష్

## When = ఎప్పుడు

When is a question word.
It helps us ask about time.
When అనే పదం మనం 'ఎప్పుడు' అని అడిగేటప్పుడు ఉపయోగిస్తాం. When" వాడి మనం ఒక పని ఎప్పుడు జరిగిందో లేదా ఎప్పుడు జరుగుతుందో అడుగుతాం.
It tells us at what time something happens.

## Examples :

When is your birthday? నీ పుట్టినరోజు ఎప్పుడు?

When do you wake up? నీవు ఎప్పుడు లేస్తావు?

When do you brush your teeth?
నీవు పళ్లు ఎప్పుడు తుడుస్తావు?

When do you go to school?
నీవు పాఠశాలకి ఎప్పుడు వెళ్తావు?

When do you eat ice cream?
నీవు ఐస్ క్రీమ్ ఎప్పుడు తింటావు?

When do you play with your toys?
నీవు బొమ్మలతో ఎప్పుడు ఆడుకుంటావు?

When does the rain come?
వర్షం ఎప్పుడు వస్తుంది?

When do birds sing? పక్షులు ఎప్పుడు పాడుతాయి?

When do you wear your uniform?
నీవు యూనిఫాం ఎప్పుడు వేసుకుంటావు?

When do you drink milk?
I drink milk at 8 AM.
నేను ఉదయం 8 గంటలకు పాలుతాగుతాను.

When do you read books?
I read books in the evening.
నేను సాయంత్రం పుస్తకాలు చదువుతాను.

When do you watch cartoons?
On Sundays! ఆదివారాలు!

### Quick Grammar Tip:

- Use do with you, we, they
- Use does with he, she, it

## కింది వాక్యాలను వీలైనన్ని ఎక్కువ సార్లు పైకి చదవండి

Exercise :

| | | | | |
|---|---|---|---|---|
| When | do | I<br>you<br>we<br>they | go<br>write<br>sleep<br>read<br>walk<br>speak | ? |

మీరు ఇలాంటి వాక్యాలు రాయడానికి ప్రయత్నం చేసి చూడండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

Exercise :

| | | | | |
|---|---|---|---|---|
| When | does | she<br>he<br>it<br>rani<br>raju | go<br>write<br>sleep<br>read<br>walk<br>speak | ? |

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________



1. లిఖిత శ్రీ, బృందావనం బాలల సంఘం, ఏడవ తరగతి, బసినేపల్లి .



2. కవిత వాలంటీర్ పోలేపల్లి




3. బి. జోష్నా ,ఎం స్రవంతి, 9వ తరగతి చిలుక బాలల సంగం.



4. పి అర్చన, 9వ తరగతి, ఆకాశం బాలల సంఘం చిన్నపరెడ్డిపల్లి.




5. బి హశ్విత భాయ్, గంగినేపల్లి తండా, నాలుగో తరగతి



6. జి హర్షవర్ధన్, 9వ తరగతి, చిన్నపరెడ్డిపల్లి ,ఆకాశం బాలల సంఘం .



7. అర్చన, పెనుకొండ, టెన్త్ క్లాస్, నక్షత్ర , 9వ తరగతి



8. ఆర్ .లిఖిత సాయి, 8వ తరగతి



9. బి పరిమళ ,9వ తరగతి, బక్షంపల్లి , భూమాత బాలలసంఘం.



10. యోగేష్ ,9వ తరగతి, పావురాల బల సంఘం, తిమ్మాపురం .



11. ఎస్. ధనుష్ ,పదవ తరగతి, వెంకటం పల్లి ,చందమామ బాలల సంఘం.



12. చైత్ర ,ఎనిమిదో తరగతి, వెంకటగిరి పాలెం,
రామచిలక బాలల సంఘం .



13. సురేంద్ర , ఎయిత్ క్లాస్,
కుంటిమద్ది, బాలగంగాధర్ తిలక్.



14. ఆర్ హేమలత, ఏడవ తరగతి,
పాలవెల్లి బాలల సంఘం, నాగసముద్రం .



15. ఎస్. మహేష్, ఏడవ తరగతి,
రెడ్డిపల్లి , శ్రీరామ బాల సంఘం .



16. యోగేష్, 9వ తరగతి, పావురాల బాలల సంఘం .



17. ఈ. గంగోత్రి , నైన్త్ క్లాస్ ,
చోలేమర్రి ,మదర్ తెరిసా బాలల సంఘం .



18. బి. జ్ఞాన దీపిక,
సిక్స్త్ క్లాస్
కంబాలపల్లి ,
రో ద్దాం మండలం,
వీరేశలింగం
బాలల సంఘం.




19. కె. హేమంత్ కుమార్, సెవెంత్ క్లాస్, చెరుకూరు,
నెహ్రూ బాలల సంఘం .



20. బి .పూజిత, ఆరవ తరగతి,
మైత్రి బాలల సంఘం, కురు వాండ్ల పల్లి .



21. జి. భవ్య హాసిని, సిక్స్త్ క్లాస్,
జాజిపువ్వు బాలల సంఘం, చంద్రగిరి .



22. ఉష. ఎనిమిదో తరగతి,
పావురాల బాల సంఘం,
తిమ్మాపురం.



23. కె.గీతిక, ఆరవ తరగతి,
కే. మరవ పల్లి, రుద్రమదేవి బాలల సగం



# పచ్చని ఇంటిలో తెల్లటి ముసుగులో నల్లటి దొంగలు



## హలో! చిన్నారి నేస్తం పాఠకులారా!


నేను ఎవరో తెలుసా? ఒక తియ్యటి ఫలం ఇచ్చే చిన్న చెట్టు! నా పేరు సీతాఫలం చెట్టు! నా కథ వినాలని ఉందా? చదవండి మరి!

నేను అన్నోనేసి అనే కుటుంబానికి చెందిన చెట్టు. మామూలుగా మనదేశానికి చెందినది కాదు, ఓ విదేశీ మొక్క. కానీ నేను ఎప్పుడూ పచ్చగా ఉండే చెట్టుని అంటే సతతహరితం.

ఇంగ్లీషులో నన్ను Custard Apple లేదా Sugar Apple అంటారు.
నా శాస్త్రీయ పేరు Annona squamosa.

### నేను ఎలా కనిపిస్తానో చూద్దాం!

నేను పొదలా, లేదంటే చిన్న చెట్టులా పెరుగుతాను. 5 నుండి 7 మీటర్ల ఎత్తు వరకు వృద్ధి చెందుతాను. నా ఆకులు సువాసన కలిగినవిగా ఉంటాయి. అవి కాండంపై ఒకదానికి ఎదురుగా అమరతాయి. నా పువ్వులు బయట పసుపు-ఆకుపచ్చగా, లోపల లేత పసుపుగా ఉంటాయి. నా బెరడు (చెట్టు తొక్క) పలుచగా, బూడిద రంగులో కనిపిస్తుంది.




### నా ఫలాల రహస్యం ఏమిటంటే...

నేను ఆగస్ట్ నుండి నవంబర్ మధ్యలో పండ్లు ఇస్తాను.నా ఫలాలు గుండ్రంగా, మొదట గట్టిగా ఉంటాయి. పండిపోయిన తర్వాత తీయగా, మృదువుగా మారుతాయి. ఫలాన్ని చెరిగితే తెల్లటి పొర కనిపిస్తుంది. అందులో దాగి ఉంటాయి నల్లటి గింజలు అదే మా నల్లటి దొంగలు!

### నా లో ఉన్న శక్తి సంగతే వేరబ్బా!

నా లో చాలా ఆరోగ్యకరమైన పోషకాలు ఉన్నవి
ఖనిజాలు: సోడియం, పొటాషియం, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్
విటమిన్లు: విటమిన్ C, నియాసిన్, నికోటినిక్ ఆమ్లం
ఆహారపదార్థాలు: కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వులు,
పిల్లలకు శక్తిని ఇచ్చే ఫలాల్లో నేను ముందుంటాను!



### ఆరోగ్యానికి కూడా మిత్రుడిని!

నా ఆకులను పేస్ట్ చేసి పుండ్లు, గడ్డలు, పూతలకు మందులా వాడతారు.
నా పండ్లను రక్తహీనత, విరేచనాలు, మంట, వాంతులు, దగ్గులకు ఉపయోగిస్తారు.
నా వేర్లను, బెరడును మరిగించి పంటి నొప్పికి మందుగా వాడతారు.

మన ఈ గ్రామాల్లో కోగిర , కంభాలపల్లి, శ్యాపురం, బీదానపల్లి, ముష్టికోవెల, గువ్వలగొందిపల్లి, అక్కంపల్లి, పోలేపల్లి, రామగిరి... కల్పవల్లి కమ్యూనిటీ వన సంరక్షణ ప్రాంతాలలో ఉన్నాయి.

నా లాంటి ఇంకా చాలా ఫలమొక్కలు మన చుట్టుపక్కల ఉన్నాయి. వాటిలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు దాగి ఉంటాయి. అవన్నీ మన ఆరోగ్యానికి సహాయపడతాయి. అందుకే వాటిని గుర్తించండి, ప్రేమించండి, సంరక్షించండి! ప్రకృతి మనకి ఒక గొప్ప బహుమతి!



రచన: డా. పాండవ గంగాధర్
రీసర్చ్ అసోసియేట్,
కల్పవల్లి ప్రోగ్రాం,
టింబక్టు కలెక్టివ్, చెన్నేకొత్తపల్లి.



# చిన్న కథ

సోము అనే పిల్లవాడు ఊరు మొత్తం అల్లరిగా తిరుగుతూ ఉండేవాడు. సోముకు చదువు అంటే చిరాకు పుస్తకాలు అంటే భయం అతని తల్లిదండ్రులు ఎంత చెప్పినా బడికి వెళ్లేవాడు కాదు.
ఒకరోజు అతని స్నేహితుడు విజయ్ సోముకి చిన్నారి నేస్తం అనే పుస్తకం ఇచ్చాడు ఆ పుస్తకంలో మంచి కవితలు బొమ్మలు పజిల్స్ జోక్స్ పిల్లల స్నేహం గురించి చదువు గురించి తెలియజేసే ఎన్నో అంశాలతో నిండి ఉంది సోము ఆసక్తిగా మొదటి పేజీ చదివాడు అందులోని బొమ్మలు చిన్న చిన్న కథలు అతని మనసును ఆకర్షించాయి రోజు ఒక పేజీ చదవడం మొదలుపెట్టాడు.

ప్రతి పేజీ చదివిన తర్వాత నేను కూడా ఇలాగే మంచిగా ఉండాలని కోరిక కలిగింది . చదవడం ఎంత సరదాగా ఉంటుందో అతనికి అర్థం అయింది తనలో ఉన్న తెలివి మేల్కొనింది తాను ఒక కొత్తదనాన్ని నేర్చుకుంటాను అనే కోరిక మొదలైంది.

ఆ పుస్తకం అతనికి చదువుకోవాలని కోరికను చదువు మీద ప్రేమను కలిగించింది ఇప్పుడు సోము ప్రతిరోజు పాఠశాలకు ఆనందంగా వెళ్లి గురువులను గౌరవిస్తూ పాఠాలు ఆసక్తిగా నేర్చుకుంటున్నాడు
చిన్నారి నేస్తం సోముకి చదువు మిత్రునిగా మార్చిన పుస్తకంగా అయ్యింది.




జయచంద్ర 10వ తరగతి కంచిసముద్రం

**పిల్లల కోసం పిల్లల ద్వారా రూపొందించిన పత్రిక!**

చిరునామ : టింబక్టు కలెక్టివ్, మోడల్ స్కూలు దగ్గర, చెన్నేకొత్త పల్లి(గ్రా)(పో)(మం), శ్రీ సత్యసాయి(జిల్లా), ఆంధ్రప్రదేశ్- 515 101

టింబక్టు కలెక్టివ్
చైల్డ్ లైన్ నెంబరు
9704039108

the timbaktu collective
life, we celebrate you